క్లుప్తంగా

జోన్‌-5 ఏసీపీగా తిరుపతిరావు



నూతన ఏసీపీ తిరుపతిరావు

కంచరపాలెం: జ్ఞానాపురం జోన్‌-5 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా ఎం. తిరుపతిరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న శాస్త్రి జీవీఎంసీ జోన్‌-2కు ఏసీపీగా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏసీపీ తిరుపతిరావు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతిరావు మాట్లాడుతూ జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలియజేశారు. టౌన్ ప్లానింగ్ టీపీవోలు, సచివాలయ టీపీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ఉమానీలకంఠేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉమానీలకంఠేశ్వరుడు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామారావు శర్మ మహేష్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, ఫలరస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకరమఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11వేల 116 విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశా రు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రం అందించారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



వాహన చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ దాశరథి

మర్రిపాలెం: హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సిబ్బందితో కలిసి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిని ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ఇద్దరూ హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ముప్పు

- జ్ఞానాపురంలో మునిగిపోయిన పలు ప్రాంతాలు
- చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్న వీధులు.. నివాస ప్రాంతాలు
- పూడికలు తీయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం



సెబాస్టియన్ కాలనీలో వర్షానికి వీధుల్లో చేరిన మురుగు నీరు

కంచరపాలెం: ఏళ్ల నాటి ఎర్రిగెడ్డ సమస్యకు మోక్షం కలిగే పరిస్థితి నేటికీ కనిపించకపోవడంతో జ్ఞానాపురం ప్రజలు చిన్నపాటి వర్షం వచ్చినా ముంపు సమస్యతో సతమతమవుతున్నారు. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్రిగెడ్డ సమీపంలో పలు కాలనీలు ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు బురద, మురుగు నీటితో జలమయం అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎర్రిగెడ్డపై ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ నిర్వహణ పట్ల కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో చెత్తా చెదారాలు మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి వర్షాలు పడిన ప్రతిసారీ కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. జ్ఞానాపురంలో గెడ్డవీధి, రాసవీధి, స్లీప్‌గుర్తు వీధి, సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీ తదితర ప్రాంతాలు వర్షాల సమయంలో రెండు అడుగుల లోతు మురుగు నీరు చేరి కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో నిధుల మంజూరు పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్‌లో



జలమయమైన గెడ్డవీధి

వార్డు కార్పొరేటర్ పూర్ణిమ ఎర్రిగెడ్డ పూడిక తొలగించే అంశమై టెండర్ పిలవాలని మేయర్, జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. తుపాన్లు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎర్రిగెడ్డలో తక్షణమే పూడికలు తొలగించాలని ఆమె కోరినా పట్టించుకోకపోవడంతో నేడు జ్ఞానాపురం ముంపునకు గురయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాన్వెంట్ కూడలిలో గల చావుల మదుం వంతెన దిగువ రహదారుల్లో వర్షాలకు రెండు అడుగుల లోతు వర్షపు నీరు చేరుతోంది. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఈ పాపం కూటమి నాయకులదే..



జూన్‌లో జరిగిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎర్రిగెడ్డ పూడిక తొలగింపు చేపడతామని మేయర్ పీలా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సర్వసభ్య సమావేశం జరిగి రెండు నెలలు గడిచినా పూడికలు చేపట్టకపోవడంతో నేడు జ్ఞానాపురంలో పలు ప్రాంతాలు తుపాన్లు, చిన్నపాటి వర్షాలకే మునిగిపోతున్నాయి. ఈ పాపం కూటమి నాయకులదే. ప్రస్తుతం వార్డులో వారి హల్‌చల్ ఎక్కువగా ఉండడంతో వారి స్వలాభం కోసం పూడిక తొలగింపు ఫైల్‌ను ఆపించారు. దీంతో ప్రజలు ముంపుతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఎర్రిగెడ్డ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే జీవీఎంసీ ఎదుట నిరసన చేపడతాను.

– కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు కార్పొరేటర్, జోన్‌-5, జ్ఞానాపురం



రాసవీధి కూడలిలో చేరిన మురుగు నీరు

సిరులతల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం 27వ రోజుకు చేరాయి. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య జరిగిన పూజలో 30 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన..

సిరులతల్లికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వివేకానంద సంస్థ మహాన్నదానం




అరుణాచలం గిరి ప్రదక్షిణ భక్తులకు అన్నదానం చేస్తున్న సూరాడ అప్పారావు తదితరులు

దాబాగార్డెన్స్: ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా స్వామి వివేకానంద సంస్థ ఆశ్రమ వాసులతో పాటు సంస్థ సభ్యులు విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, అరుణాచలం, తిరుపతి వంటి ఆధ్యాత్మిక యాత్రలకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం అరుణాచలం రమణ మహర్షి సన్నిధిలో అరుణాచలం గిరి ప్రదక్షిణ భక్తులకు సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక యాత్రలు నిర్వహిస్తూ.. ఓ పుణ్యక్షేత్రంలో కాశీ అన్నపూర్ణేశ్వరి ఆశీస్సులతో నారాయణ సేవలు నిర్వహిస్తూ వస్తున్నామని, నిత్యాన్నదానమే సంస్థ లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అప్పారావు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆర్థిక సహాయం అందజేశారని చెప్పారు. అన్నదాన కార్యక్రమంలో సంస్థ సభ్యులు వి.కోదండరావు, సీహెచ్ మసేన్, వి.దానయ్య, సోంబాబు, భానోజీరావు, పి.నల్లరాజు, వి.తాతబ్బాయి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 6 కేజీల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ మహిళా ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ కెల్లి అనంతరావు సిబ్బందితో మంగళవారం ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తిరువల్లూరు జిల్లా తమిళనాడు రాష్ట్రానికి చెందిన అరుణ్‌కుమార్ బి. విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని రూ. 30 వేల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు.

సేవా కార్యక్రమాలకు ప్రణాళిక



మాట్లాడుతున్న భానుప్రకాష్

మురళీనగర్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ప్రణాళిక తయారు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. వాకర్స్ పార్కులో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఉచిత వైద్య శిబిరం, 25న మట్టి వినాయకులు, వినాయక వ్రతకల్పం పుస్తకాల పంపిణీ, 31న మిమిక్రీ, మ్యాజిక్ షో, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై అవగాహన

మురళీనగర్: పరిశ్రమల స్థాపన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగం అనే అంశంపై కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ల్యాబ్ కార్ప్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున కొరిపాడు పాల్గొని ప్రసంగించారు. పరిశ్రమల అవసరాలు అందుకు అనుగుణంగా విద్యార్థులు నేర్చుకోవాల్సిన అంశాలు, కృత్రిమ మేధస్సుతో భవిష్యత్ ఉద్యోగావకాశాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టీడీ పూర్వ చైర్మన్ డాక్టర్ ఒఎం రావు, ప్రొఫెసర్ సాంబశివరావు, కార్యదర్శి డాక్టర్ ముఖేష్ పాల్గొన్నారు.

శత శాతం చెత్త సేకరణ జరగాలి

జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

దాబాగార్డెన్స్: ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ శత శాతం జరగాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగంపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఇతర ప్రజారోగ్య అధికారులతో పాటు టెలీ కాన్ఫరెన్స్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజారోగ్య విభాగం అధికారులు, పారిశుధ్య కార్మికులు చెత్త పేరుకుపోకుండా చూడాలని ఆదేశించారు. చాలా వార్డుల్లో చెత్త సేకరణ అనుకున్న స్థాయిలో జరగడం లేదని, ఆయా శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆరా తీశారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అనుమతుల కోసం సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలోను ఇప్పటికే ఏర్పాటు చేశామని, సాధ్యమైనంత వరకు అనుమతుల కోసం ప్రధాన కార్యాలయానికి రాకుండా జోనల్ కార్యాలయాల్లోనే అనుమతులు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వల్ల జీవీఎంసీ పరిధిలోని గెడ్డలు ఎక్కడా పొంగలేదని, అందుకు నిత్యం గెడ్డల్లోరి వ్యర్థాలు తొలగించడమే కారణమని తెలిపారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అపరాధ రుసుం సరిగ్గా వసూలు చేయకపోవడం వల్ల ప్లాస్టిక్ వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. దుకాణాల ముందు వ్యర్థాలపై అపరాధ రుసుం వసూలు చేయాలని, నగరంలో ట్రేడ్ లైసెన్సులు కొత్తగా వేయడంపై దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందకుండా కావల్సిన కెమికల్స్ సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. నగరంలో పందులు, వీధి కుక్కలు, పశువుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, వీధికుక్కల నియంత్రణకు ప్రతిరోజూ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. 40వ వార్డు ఏకేసీ కాలనీ-1 సచివాలయ శానిటరీ కార్యదర్శి సన్యాసిరావు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నందున అతనికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ వైద్యాధికారులు, జీవీఎంసీ బయాలజిస్ట్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మలేరియా సిబ్బంది, వెటర్నరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రుణాలు, ఎగుమతి, దిగుమతులపై సమావేశం

దాబాగార్డెన్స్: బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ కార్యాలయంలో మంగళవారం ఉద్యమ వికాస మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగుమతి, దిగుమతిదారులతో సమావేశం జరిపారు. ఎంఎస్ఎంఈ కస్టమర్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు విశాఖపట్నం జోన్ జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా తెలిపారు. బ్యాంక్ ముఖ్య కార్యాలయం నుంచి చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్ డిపార్టుమెంట్, ముంబై) బి.కుమార్, ఏజీఎం జయకృష్ణ, చీఫ్ మేనేజర్ (ఎంఎస్ఎంఈ రుణాలు) సచిన్ రాహుల్, పలువురు అధికారులు పాల్గొని ఎంఎస్ఎంఈ రుణాలు, ఎగుమతి, దిగుమతి ఫైనాన్సింగ్, ఇతర ఆర్థిక ఉత్పత్తులపై సూచనలు చేశారు. అలాగే బ్యాంక్ అధికారులు, ఎంఎస్ఎంఈలు, ఎగుమతి, దిగుమతిదారుల మధ్య సవాళ్లు-అవకాశాలు, పరిష్కారాలపై చర్చించారు. ఎంఎస్ఎంఈ రంగానికి బ్యాంక్ మద్దతు, ప్రాంతీయ ఆర్థిక వృద్ధి పట్ల నిబద్ధత, ఆర్థిక పరిష్కారాలకు సేవలందించడంలో బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ సీతారామ్ నిట్టాల, బ్యాంక్ అధికారులు, ఎంఎస్ఎంఈలు, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

కూటమి నేతల మోసాలపై ఇంటింటి ప్రచారం



బంగారుమెట్టలో ప్రచారం చేస్తున్న రమేష్ తదితరులు



పీతల వాసు నేతృత్వంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో వార్డు నాయకులు



ప్రసాద్‌గార్డెన్స్‌లో ప్రచారం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో 33వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముత్తా బత్తుల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. బంగారుమెట్ట కాలనీ బూత్ నంబర్ 64 పరిధిలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందీ వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, సలాది భాను, లక్ష్మీకాంతం, కొల్లు సత్యవతి, బూర్లి చిన్న, హేమ, కృష్ణారెడ్డి, బాడుగుల శ్రీనివాసరావు, పీవీఎస్ రెడ్డి, దుర్గారావు, పులి, రంజిత్, కామేశ్వరరావు, గురుస్వామిరెడ్డి, ధర్మ, చోడిపల్లి శివకుమార్, పాల దామోదర్ రెడ్డి, తరుణ్ కుమార్, జి.కొండలరావు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం వార్డులో 86వ బూత్ ప్రసాద్‌గార్డెన్స్‌లో కార్యకర్తలతో కలిసి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు పెట్టి వాటిని కూడా విస్మరించారన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి అయితే పేదలకు సంక్షేమం అందుతుందని కనకరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, సౌత్ గ్రీవెన్స్‌సెల్ ప్రెసిడెంట్ బుజ్జి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, వై. రమణమ్మ, పి.రమణమ్మ, దుర్గాప్రసాద్, శేఖర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

దాబాగార్డెన్స్: చంద్రబాబు మోసాలు ఎండగడుతూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో మంగళవారం వార్డు పరిధిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ బూత్ నంబరు 187 పరిధి గ్రాండ్‌బే హోటల్ ఏరియా, సూర్యనగర్, గోకుల్‌రోడ్డు, సెంచురీ క్లబ్ తదితర ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు వివరించారు. కార్యక్రమంలో బెవర మహేష్, బొండాడ వెంకట్రావు, ఆరుగుల రాజ్‌కుమార్, గుమ్మడి చంద్రమౌళి, కోట ఆనందప్రసాద్, జి.శివ, సతీష్, ఉమ, పప్పు కమల, గండివలస పెంటయ్య, మధు, పీతల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర వైద్యులు మంగళవారం నగరంలోని పలు ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీ చేశారు. గిగ్లెస్ ఒమ్ని ఆర్కే, నోవా ఐవీఎఫ్, లాన్సెట్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రికార్డులు, ఇతర పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమందికి సంతానోత్పత్తి చికిత్స చేశారు వంటి వివరాలను డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. అలాగే స్కానింగ్ గది బయట, లోపల, రిసెప్షన్‌లో ధరల పట్టికను, ఇతర బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, ప్రతీ ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని ఆదేశించారు. ఫారం-ఎఫ్‌పై గర్భిణి, స్కానింగ్ చేసే వైద్యుడి సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను స్కానింగ్ గదిలో ప్రదర్శించాలని, స్కానింగ్ యంత్రాలను మార్చరాదన్నారు. నిర్దేశించిన గడువు కంటే రెండు నెలల ముందుగానే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.